ప్రజాశక్తి
సోమవారం 19 ఫిబ్రవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌డబ్ల్యుఓ రవి నిరుపేద గిరి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఆయన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తుంటారు. వివిధ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షల్లో పాల్గొనే వారికి సలహాలు ఇస్తూ వారికి ఆర్థికంగా కూడా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. కళాశాల విద్యార్థులకు హెచ్‌డబ్ల్యుఓ అందిస్తున్న సేవలను పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు.



స్టడీ మెటీరియల్ ఇస్తున్న హెచ్‌డబ్ల్యుఓ

మాట ఇచ్చి.. మడం తిప్పి...

- హామీలను మరచిన సిఎం జగన్
- ఆందోళనలు చేపడితే కేసులతో బెదిరింపులు
- మండిపడుతున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు



ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

ప్రతిపక్ష నేతగా జగన్ ఉద్యోగులకు తియ్యని మాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక.. డిఎ బకాయిలు, పెండింగ్ బిల్లులు చెల్లించ లేదు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తానని వాగ్దానాన్ని తుంగలో తొక్కారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్ సి, డిఎలతో పాటు మరి కొన్ని ఆర్థిక బకాయిలు చెల్లించలేదు. చివరికి ఉద్యోగులు దాచుకున్న ఎపిజిఎల్ఐ, పిఎఫ్ సొమ్ము కూడా ఈ ప్రభుత్వం వాడుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల పోరాటాలతో రద్దు చేయించిన అప్రెంటిస్ విధానం తిరిగి అమలుకు నిర్ణయం, సిపిఎస్ రద్దు చేయకపోవడం, ఆర్థిక ప్రయోజనాలను కల్పించకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఈ సమస్యలపై ఆందోళనలు చేస్తున్న ఉద్యోగులపై నిర్బంధాలు ప్రయోగిస్తుంది. ప్రశ్నించినా, ఆందోళన చేసినా, నిరసన తెలిపినా కేసులతో భయపెడుతోంది.

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపిలో ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. జీతం సమయానికి రాదు ఆర్థిక ప్రయోజనాలకు నెలల కొద్ది నిరీక్షించాల్సిన దుస్థితి. సమస్యలపై నిరసన తెలుపుదామంటే ఆంక్షలు, కేసులు, నిర్బంధాలు, కక్ష సాధింపులు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీన జీతం వస్తుందనుకునే రోజులు పోయాయి. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఎప్పుడొస్తుందో తెలియదు. తమ ప్రయోజనాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల ఉద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమకు రావాల్సిన బకాయిలు సైతం ఇవ్వకుండా తమను మానసికంగా వేధిస్తోందని రగిలిపోతున్నారు.

ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రతిసారీ చర్చల పేరుతో పిలవడం, హామీలు గుప్పించడం, వాటిని నెరవేర్చకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తోంది. పాత వాయిదాల పరిస్థితి గురించి స్పష్టత ఇవ్వకుండా కొత్తగా వాయిదాలు వేయడం చూస్తుంటే ఉద్యోగుల సమస్యల విషయంలో ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. సర్కారు తీరుపై ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇలాంటి దుస్థితి ఎప్పుడు చూడలేదని అంటున్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేసినప్పటికీ ఏమాత్రం ప్రగతి లేదని మండిపడుతున్నారు. గతేడాది జూలై 1 నుంచి 12వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉన్నా నేటికీ అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులు తమ సొంత డబ్బును వాటాగా కడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు, పార్ట్ ఫైనాన్స్ కోసం చేసుకున్న దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగుల బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్నాయని ఇలాంటి దుస్థితి ఎప్పుడూ లేదని అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీల అమలేదీ?

తక్షణమే ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే మరో చలో విజయవాడ తప్పదు. ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే అనేకమార్లు చర్చలు జరిపారు. సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన ఉంది. అధికారంలోకి వచ్చిన వారం రోజులు సిపిఎస్ రద్దు చేస్తానన్న హామీ అటకెక్కింది. సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ తీసుకురావడంతో మరింత నష్టం చేయడమే. ప్రభుత్వం స్పందించాలి.



వి.మహేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ఉద్యోగులు ఇలాంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. నెలనెలా వేతనాలు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూడాల్సి వస్తోంది. 12వ పిఆర్ సి, మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలి. పెండింగ్ లో ఉన్న రెండు కొత్త డిఎలను వెంటనే విడుదల చేయాలి. పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, క్లెయిమ్స్, 11వ పిఆర్‌సి డిఎ, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్ మెంట్, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లు బకాయిలు చెల్లించాలి. ఒపిఎస్‌ను అమలు చేయాలి.



ఆర్.సూర్యనారాయణ
టిడబ్ల్యూటియు రాష్ట్ర అధ్యక్షుడు

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలి. పేరుకు పోయిన బకాయిలు వెంటనే చెల్లించాలి. తక్షణమే మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలి. ప్రభుత్వ ఉద్యోగికి రావాల్సిన బకాయిలను పెండింగ్‌లో పెట్టడం అన్యాయం. తమ ఆర్థిక సమస్యల పరిష్కారంపై, ప్రయోజనాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదు. ఇతర సమస్యలు పరిష్కరించాలి. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉద్యోగులకు ఇదివరకున్న ఆర్థిక ప్రయోజనాలకు నష్టం చేశారు. గత ప్రభుత్వం 20 శాతం ఐఆర్ ఇస్తే 27 శాతం ఇస్తామని చెప్పి తర్వాత పిఆర్‌సిలో జీతాలు తగ్గించారు.



కె.నీలకంఠం
టిడబ్ల్యూటియు జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కపటి ప్రేమను ప్రదర్శిస్తుంది. ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి చూపడం లేదు. తమ హక్కులు, అలవెన్స్ ల కోసం రోడ్డెక్కాలా..? 12వ పిఆర్ సి కమిషన్ వేసి అన్ని వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పార్ట్ ఫైనల్స్ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపి కంటి తుడుపు చర్యలతో మోసగిస్తున్నారు. అందుకే తప్పని పరిస్థితుల్లో ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.




కుర్సాడి రామారావు
టిడబ్ల్యూటియు
జిల్లా గౌరవ అధ్యక్షుడు

సికిల్ సెల్ ఎనీమియా నివారణకు చర్యలు

- -కుటుంబ నియంత్రణకు ప్రత్యేక క్యాంపులు
- - మాతా శిశు మరణాల నివారణకు నిర్దిష్ట చర్యలు
- -ప్రజాశక్తితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు: **అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మిషన్ ఏర్పాటైనట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ బాషా వెల్లడించారు. మన్యంలో గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న వైద్యారోగ్య కార్యక్రమాలపై ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే..**





సికిల్ సెల్ నిర్మూలనకు చేపడుతున్న చర్యలు?

సికిల్ సెల్ నిర్మూలన కోసం ప్రభుత్వ ప్రకటించిన మిషన్ ద్వారా గిరిజన ప్రాంతంలో 0-40 ఏళ్ల మధ్య వయస్సు గల రెండు లక్షల 45 వేల 111 మందికి స్క్రీనింగ్ టెస్ట్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. కుటుంబ సంక్షేమ శాఖ నుంచి 2 లక్షల 73 వేల525 రాపిడ్ టెస్ట్ కిట్లు పంపిణీ జరిగింది. ఇప్పటివరకు 1లక్ష 90 వేల 151 మందికి స్క్రీనింగ్ నిర్వహించాం. ఇందులో 1000 మందికి సికిల్ సెల్ పాజిటివ్ వచ్చింది. వీరికి హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ (హెచ్ పి ఎల్ సి) పరీక్ష ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించి వైయస్సార్ పెన్షన్ పథకం మంజూరు, బాధితులకు ఉచితంగా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మంజూరు చేసిన పింఛన్లు

ప్రస్తుతం వైయస్సార్ పెన్షన్ పథకం కింద నెలకు పది వేల చొప్పున 877 మందికి సికిల్ సెల్ బాధితులకు పెన్షన్లు అందుతున్నాయి.

మాతా శిశు మరణాలకు చర్యలు

గిరిజన ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ పాటించకపోవడంతో అధిక కాన్పుల మూలంగా మాతా శిశు మరణా సంభవిస్తున్న పరిస్థితి ఉంటుంది దీన్ని అధిగమించి మాతా శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాము.

హైరిస్క్ కేసులపై తీసుకుంటున్న చర్యలు

ముఖ్యంగా కాన్పులకు ఆసుపత్రులకు రావాలని గ్రామాల్లో వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు చైతన్య పరుస్తున్నాం. అలాగే హై రిస్క్ కేసులను గుర్తించి 15 రోజులు ముందుగా కాన్పు కోసం ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, తరలిస్తున్నాం. వీటిల్లో స్కానింగ్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చాం. వైద్య సేవలు కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మాతా శిశు మరణాలను అరికడుతున్నాం.

కుటుంబ నియంత్రణకు క్యాంపులు

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రత్యేక కుటుంబ నియంత్రణ క్యాంపులు నిర్వహిస్తున్నాం. వేసక్టమీ ఆపరేషన్లు 800 వరకు నిర్వహించాం. ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహిం చడానికి గైనిక్‌లు అవసరం ఉంది. ఇందుకుగాను 10 మంది డాక్టర్లకు ప్రత్యేక శిక్షణ నిచ్చి కుటుంబ నియంత్రణ పై చర్యలు తీసు కుంటున్నాం.

కంటి వెలుగు ప్రోగ్రాంకు వస్తున్న స్పందన

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 22 మండలాల్లో 17వేల 664 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఇందులో 999 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లకు గుర్తించి 582 మందికి పూర్తి చేసాం. మిగిలిన వారికి ఆపరేషన్లు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. 12 వేల237 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసాం ఇంకా 1874 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నాం.

రహదారి భద్రతపై అవగాహన



మోటారు యూనియన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌టిఒ రాజేష్‌కుమార్

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలోని వేటమామిడి పంచాయతీ మెట్లపాలెం గ్రామ సమీపంలో అడ్డతీగల లక్ష్మీ గణపతి మోటర్ యూనియన్ ఆధ్వర్యంలో కొండరాజుల పండగ ఘనంగా నిర్వహించారు. వేడుకలో రంపచోడవరం ఆర్‌టిఒ ఆర్ రాజేష్‌కుమార్, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా మోటార్ యూనియన్ నాయకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్‌టిఒ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ, వాహనదారులంతా రికార్డులను ఉంచుకోవాలని, ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ ఉంచుకోవాలన్నారు. వాహనపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే, వెంటనే పూర్తి ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామన్నారు. వాహనాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే, నేరుగా రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడుపుకోవాలని, తద్వారా ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారముండదన్నారు. ఈ సందర్భంగా మోటారు యూనియన్ ప్రతినిధులకు వారు పండుగశుభాకాంక్షలు తెలిపారు. అధిక సంఖ్యలో వాహన యజమానులు, డ్రైవర్లు, యూనియన్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

బాగా చదివి పరీక్షలకు సిద్ధంకండి

జెడ్‌పిటిసి దీసరి గంగరాజు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి: మండలంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలలో ఎస్.ఎఫ్.ఐ, ఆదివాసీ గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక, జెవివి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జెడ్పీటీసీ దీసరి గంగరాజు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.5000 రెండవ రూ. 3000, మూడవ బహుమతి రూ.2000 అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ -1 పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు విమల, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి జీవన్, మండల కార్యదర్శి శ్రీనివాస్, భీమరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

నేలకొరిగిన ఉద్యమాల వృక్షం

రోడ్డు విస్తరణలో కొట్టేసిన అధికారులు ... మదనపడుతున్న మన్యవాసులు, ప్రకృతి ప్రేమికులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: దశాబ్దాల చరిత్ర కలిగి, ఉద్యమాలకు కేంద్రబింధువుగా ఉన్న ఉద్యమాల భారీ మామిడి వక్షం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నేలకొరిగింది. ఆర్అండ్‌బి అతిథి గృహం ఎదురుగా ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ఈ భారీ మామిడి చెట్టు, వేసవిలో ఎంతోమంది బాటసారులకు, వాహన చోదకులకు, చిరు వ్యాపారులకు, ఎన్నో పశుపక్ష్యాదులకు సేదదీరేందుకు నీడ నిచ్చేది.మన్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షకులు, పార్టీలకు అతీతంగా ఎవరైనా, ఎటువంటి ఉద్యమం, పోరాటాన్ని మొదలుపెట్టాలంటే సెంటిమెంట్‌గా ఈ చెట్టునుంచే ప్రారంభించేవారు. సిపిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యంలో జరిగే ప్రతి పోరాటాన్ని ఈ మహావృక్షం నుండే మొదలుపెట్టేవారు. చివరగా ఇటీవల విజయవంతమైన అంగన్వాడీల 42 రోజుల సమ్మె పోరాటాన్ని కూడా ఇదే చెట్టు కింద నిర్వహించారు. ఆశా వర్కర్ల నిరసన చివరగా ఇక్కడే జరిగింది. నీడనివ్వడంతోపాటు పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండే ఈ భారీవృక్షాన్ని నేలకూల్చడంతో ఆప్రాంతమంతా బోసిపోయింది. ఇంతటి చారిత్రక నేపథ్యం, సెంటిమెంట్ ఉన్న ఏళ్లనాటి వృక్షాలతోపాటు ఏజెన్సీ పొడుగునా రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తుండడంతో ఏదో కోల్పోతున్నామనే భావనతో మన్యవాసులు మదన పడుతున్నారు. రోడ్డు విస్తరణ అవసరమే అయినా, దాని వల్ల మన్యంలో రోడ్ల వెంబడి పచ్చదనంతోపాటు నీడనిచ్చే వృక్షాలు కనుమరుగవుతుండడంతో ఏజెన్సీ ప్రాంత వాసులతోపాటు ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.



జాతీయ రహదారి విస్తరణలో కొట్టేసిన ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద నున్న ఏళ్లనాటి మామిడి వృక్షం

ఎన్నికల సెక్టోరియల్ అధికారులుగా

వేరే ప్రాంత ప్రభుత్వ ఉద్యోగులనే నియమించాలి

కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలను రద్దు చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-విఆర్.పురం : రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులుగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నిక ప్రక్రియ ప్రారంభం నుంచి, ఫలితాల వెల్లడితో ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారి పాత్ర చాలా ప్రధానమైనదని, ఆ స్థానంలో బాధ్యతాయుతమైన పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులనే నియమించాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఇజిఎస్, వైఎస్ఆర్ క్రాంతిపథం వంటి విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సెక్టోరియల్ అధికారులుగా నియమి ంచారని, వెంటనే వారిని ఆయా బాధ్యతలను నుంచి తప్పించాలని ఎన్నికల సంఘాన్ని కిరణ్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు నేరుగా అందించే వెలుగు, ఉపాధిహామీ పథకం, సచివాలయాలు వంటి కార్యాలయాల్లో మూడేళ్లకు మించి దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఇటువంటి ఉద్యోగులు ఓటింగ్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. సంస్థలైన వైయస్సార్ క్రాంతి పదం మరియు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ సంస్థలో దీర్ఘకాలికంగా ఒకే చోట గత మూడు సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఉద్యోగులను,

చింతూరు, వర రామచంద్రపురం కూనవరం, ఎటపాక మండలాలతోపాటు రంపచోడవరం ఏజెన్సీలోని ఏడు మండలాల్లోనూ కొందరు ఇలాంటి ఉద్యోగస్తులు వారు నియామకం జరిగిన నాటి నుంచి, నేటివరకు ఒకేచోట ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ఆయా విభాగాల్లో స్థానికులైన ఉద్యోగులందరినీ తక్షణమే బదిలీ చేయాలని కోరారు. లామంది ఉద్యోగస్తులు మూడేళ్లకు మించి ఒకేచోట పనిచేస్తున్నారని, అలాగే కొందరు ఉద్యోగులు మహిళా ప్రజా ప్రతినిధులకు భర్తలుగా ఉన్నారని, వీరంతా ఎన్నికలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపే అవకాశాలు మెండుగా ఉన్నందున వీరందరినీ ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించడంతోపాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత కిరణ్

పోలీసుల సూచనలు పాటించాలి

పర్యాటక ప్రాంతాల్లో జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన సందర్శకులు ఇక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పించారు. ఆదివారం మండలంలోని ఐ.పోలవరం పార్క్ వద్ద పర్యాటకులతో సమావేశం నిర్వహించి, మన్యంలో సందర్శకుల సౌకర్యార్థం అన్ని పర్యాటక ప్రాంతాలతోపాటు మార్గమధ్యలో ప్రమాదభరిత ప్రాంతాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యాన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని, అందులోని సూచనలను పాటిస్తూ, తగు జాగ్రత్తలతో ముందుకు సాగితే, ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా, విహారయాత్ర శుభతరంగా సాగుతుందని వివరించారు. ఐ.పోలవరం వద్ద రెండు నెలల వ్యవధిలో జరిగిన ప్రమాదాలను పర్యాటకులకు వివరించి, పోలీసుల సూచనలను నిర్లక్ష్యం చేయడం వల్లే వారు ప్రమాదాల బారినపడిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో రంపచోడవరం అదనపు ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముమ్మర దర్యాప్తు

- 9 మందిని విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -చింతూరు: మోతుగూడెం ఐఎన్‌టియుసి 327 కార్యాలయంలో శనివారం పట్టుబడిన గంజాయి కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. 9 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు విషయమై ఒఎస్‌డి ప్రత్యేకంగా మోతుగూడెం స్టేషన్‌కు వచ్చి విచారణ జరుపుతున్నారు. నిందితులు ఎవరు అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. అయితే కొందరు జెన్‌కో ఉద్యోగస్తులను విచారిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ కేసుకు సంబంధించి పూర్తి విచారణ జరిపిన తర్వాత వివరాలనుమీడియాకు వెల్లడిస్తారని పోలీసు అధికారులు తెలిపారు.

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని టోకురు పంచాయతీ పరిధి చిసగుడ గ్రామానికి చెందిన బాలిక సార మోకాస (మూడు సంవత్సరాలు) మృతి చెందింది. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలికలకు వైద్య సేవలు అందించినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడలేదని, ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బాలిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు నీరుగా బోరున విలపించారు



సార మోకాస (ఫైల్‌ఫొటో)


విద్యార్థులను పరామర్శిస్తున్న పిఒ అభిషేక్

ఆశ్రమ విద్యార్థులకు మెరుగైన వైద్యం

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి పాడేరు: ఐటీడీఏ పరిధిలోని అనంతగిరి, ముంచింగిపుట్టు, పాడేరు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలిసుకున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ శనివారం రాత్రి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి ఆశ్రమ విద్యార్థులకు ప్రత్యేక వార్డు కేటాయించాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కు సూచించారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆస్పత్రిలో అన్ని వార్డులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను వినియోగించాలని సూచించారు. సిబ్బంది కొరత పై వైద్య కమిషనర్‌కు లేఖ రాస్తామ్నారు. ముగ్గురు పాఠశాల విద్యార్థులకు చికిత్స అందించగా ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కేజీహెచ్ కి తరలిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహాలలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉపాధ్యాయులు విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి సాధించాలని తెలిపారు. విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు పాఠశాల నిర్వాహకులు బాధ్యత వహించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిఒతో పాటు డిడి కొండలరావు, ఏ టీ డబ్ల్యులు రజిని, వెంకటరమణ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణా విభాగం ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై మున్సిపాలిటీ పెద్ద బొడ్డేపల్లిళక్ష భద్రం ఫౌండేషన్ కళాజాత బృంద నాటకాన్ని ప్రదర్శించారు. హైచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రక్తదానం పై అవగాహన కల్పించారు. సుఖ వ్యాధులు చికిత్స, ఐసీటీసీ కౌన్సిలింగ్ కేంద్రాలపై తెలిపారు. హెచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా చాడాలన్నారు. అనంతరం పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమములో వార్డు కౌన్సిలర్ గుడివాడ రాజు నాయుడు, ఎయిడ్స్ కొంట్రోల్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ శెట్టి గోవింద్, సిబ్బంది నాయుడు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: మున్సిపాలిటీ 28వ వార్డు అయ్యన్నకాలనీలోని నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపాన్ని ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే గణేష్, లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తామరణ అప్పలనాయుడు, వెలగా నారాయణరావు హాజరయ్యారు. కళ్యాణమండపాన్ని ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించగా, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని డాక్టర్ అధికారి గోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, అందరి సహాయ సహకారాలతో అందరికీ ఉపయోగపడే కళ్యాణ మండపం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కళ్యాణమండపం నిర్మించినందుకు కమిటీ సభ్యులను అభినందించారు. ఎటువంటి అద్దె లేకుండా కేవలం కరెంట్ బిల్లు, నామమాత్రంగా మెయింటెనెన్స్ చార్జీలు మాత్రమే తీసుకొని కళ్యాణ మండపం అందరికి అందుబాటులో తీసుకురావడంతో పేదవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

హాజరైన టెన్త్ విద్యార్థులు


ఎస్ఎఫ్ఐ నిర్వహించిన టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పాడేరు డివిజన్లో ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ఎస్ఎఫ్ఐ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఈ మేరకు పాడేరు డివిజన్లోని పాడేరు, హుకుంపేట, అనంతగిరి, అరకు వ్యాలీ, డుంబ్రిగూడ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో టాలెంట్స్ నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 117 మంది టెన్త్ విద్యార్థిని విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొర్ర కార్తీక్ జీవన్, కృష్ణ మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థుల్లో సహజంగా ఉండే బెరుకుతనం, భయం పోగొట్టడానికి టెస్టులు దోహదపడతాయన్నారు. తమలో ఉండే ప్రతిభ సామర్థ్యాలను విద్యార్థులు తెలుసుకునేందుకు, మనో ధైర్యాన్ని కల్పించేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. వచ్చే వారం పాడేరు డివిజన్లోని మిగిలిన మండలాల్లో కూడా ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌కు హాజరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చిన్నారావు, వివిధ మండలాల ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. 260 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మాన పడాల్ మాట్లాడుతూ, భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఇటువంటి టెస్టులు ఎంతగానో దోహద పడతాయన్నారు. విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్ళాలని సూచించారు. స్కూల్‌కి, మండలానికి, మన జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు.కె.శ్రీను మాట్లాడుతూ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జి. కేశవి దేవి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పి.వరహాలబాబు పాల్గొన్నారు.

నేడు సిహెచ్‌డబ్ల్యుల చలో ఐటిడిఎ

ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్



దీక్షలో కూర్చున్న సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశా వర్కర్లుగా గుర్తించి, వేతనాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) ఈనెల 19న సోమవారం చలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ 11 మండలాల పరిధిలో 2017 నుంచి పని చేస్తున్న 687 మంది సిహెచ్‌డబ్ల్యులు ఆశా వర్కర్లుగా స్థాయి పెంపు కోసం కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్నారు. వీరంతా ఈనెల 15,16, 17 తేదీల్లో ఐటిడిఏ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు,. అంతకు ముందు కూడా ధర్నా, రిలే దీక్షలు వంటి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ ఫలితం లేక పోయింది. దీంతో, తమ పోరాటాన్ని కొనసాగిస్తూ చలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి 11 మండలాల నుంచి సిహెచ్‌డబ్ల్యులు హాజరవుతున్నారు.

జయప్రదం చేయాలి :సిఐటియు

కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చాలని ఈనెల 19న చేపట్టే పాడేరు ఐటిడిఏ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆశా వర్కర్స్‌తో సమానంగా పని చేస్తున్నా ఇచ్చే వేతనాల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. పదివేల వేతనంతో పాటు మొబైల్స్, యూనిఫార్మ్ వంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం పోస్టులు భర్తీలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, టిఏ, డిఏ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

20న రాజ్ గోపాల్‌కు పురస్కారం

ప్రజాశక్తి- కలెక్టరేట్: అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ సినీ గాయకులు, సంగీత దర్శకులు పాలగుమ్మి రాజ గోపాల్ కు ఘంటసాల సేవా పురస్కారం ప్రధానం చేయనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపాక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 న సాయంత్రం 6 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రం ఏర్పాటయ్యే ఘంటసాల సినీ సంగీత విభావరిలో ఖ్యాతి గాంచిన గాయనీ గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం సాలూరి రాజేశ్వరరావు వద్ద సహ సంగీత దర్శకుడిగా పని చేసిన పాలగుమ్మి రాజ గోపాల్ ను ఆత్మీయ సత్కారం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుత రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ కె. సుహాసిని ఆనంద్ పాల్గొంటారన్నారు. సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

25న డాక్టర్ జయ గోపాల్ సంస్మరణ సభ

ప్రజాశక్తి-కలెక్టరేట్: భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, సాంస్కృతిక ఉద్యమకారుడు, ఆంధ్రా పెరియార్ డాక్టర్ జయ గోపాల్ సంస్మరణ సభను ఈనెల 25న ఉదయం 10 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించినట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు జె.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 1972 ఫిబ్రవరి 13న భారత నాస్తిక సమాజాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జై గోపాల్ స్థాపించడమే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలలో హేతువాద నాస్తిక ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. గత 52 ఏళ్లగా దేశంలోని వివిధ ప్రాంతాలలో కుల మత మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను చేపట్టడమే కాకుండా వాటి నిర్మూలనకు, దళితులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా చైతన్య పరచడమే కాకుండా సాంస్కృతిక ఉద్యమాల ద్వారా మాత్రమే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని డాక్టర్ జయ గోపాల్ భావించారని తెలిపారు.

శంఖారావానికి చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో సోమవారం నిర్వహించే టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ శంఖారావం సమావేశానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. స్టేజీ నిర్మాణం, హోర్డింగ్‌ల ఏర్పాట్లను పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టిడిపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి, శంఖారావ సభను జయప్రదం చేయాలని కోరారు.

కోటవురట్ల: మండలంలో కోటవురట్లలో మర్రిచెట్టు ప్రాంతం వద్ద ఈనెల 20న చేపట్టే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి శంఖారావం సభ సందరభంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే, టిడిపి మహిళా అధ్యక్షురాలు అనిత ఏర్పాట్లు పరిశీలించారు. శ్రేణులంతా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపికి అనుకూల పవనాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలంతా వైసిపికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సుంకర బాబ్జి, పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏ ఎల్ పురం మేజర్ పంచాయతీలో గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల.సుజాత అభ్యర్థన మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, అనకాపల్లి ఎంపి భీశెట్టి వెంకట సత్యవతి గ్రామానికి రెండవ ఎస్సీ సామాజికి భవనానికి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉందని మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు బుల్లిప్రసాద్, కృష్ణ, పెదబాబు, కొండలబాబు పాల్గొన్నారు.

మాడుగుల ఎంపిపిగా వెంకట రాజారామ్

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల ఎంపిపిగా తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ నియమితులయ్యారు. ఆదివారం మాడుగుల మండల పరిషత్ అధ్యక్షునిగా జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని రాజా రామ్‌కు అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సహకారంతో బాధ్యతలు శ్రద్ధగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మాజీ ఎంపీపీ రామ ధర్మాజ, ఎంపీడీఓ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో బికె పల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన పనులు ఆదివారం ప్రారంభించారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మాణం చేపడుతున్న పనులను స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు ప్రారంభించారు. కాగా ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని సర్పంచ్ లింగం నాయుడు విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.


లోకేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విల్లూరి దంపతులు

దక్షిణ టిడిపి టికెట్ కోసం విల్లూరి దంపతుల దరఖాస్తు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి తిరుమల దేవి చక్రవర్తి శంఖారావం పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం టిడిపి టికెట్ కోసం దరఖాస్తులు సమర్పించారు. లోకేష్‌ను సత్కరించి విల్లూరి చిన్నతల్లి ట్రస్ట్ జ్ఞాపిక బహుకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

20న ఇగ్నో 37వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 37వ స్నాతకోత్సవం ఈ నెల 20న జరుగనుందని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కడ్ విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అధ్యక్షత వహించే ప్రాంతీయ స్నాతకోత్సవానికి విశిష్ట అతిథిగా దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య డి.సూర్యప్రకాశ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యార్థులకు డిగ్రీ, డిప్లొమోలను ప్రదానం చేయనున్నారు. విశాఖపట్నం ప్రాంతీయ స్నాతకోత్సవం స్థానిక పాత జైలు రోడ్డులోని విశాఖ మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాలలో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి జరగనుంది. మరిన్ని వివరాలకు విద్యార్థులు ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



మరమ్మతులు తరువాత సుందరంగా విశాఖ మ్యూజియం

నేడు విశాఖ మ్యూజియం పున: ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకి చెందిన విశాఖ మ్యూజియాన్ని సోమవారం నుంచి పున: ప్రారంభించనున్నట్టు కమిషనర్ సిఎమ్.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విశాఖకు ఇచ్చిన హామీల అమలేదీ ?

రైల్వే జోన్, మెట్రో రైలు ఏమయ్యాయి..
జగన్ సర్కారుపై శంఖారావం సభల్లో లోకేష్ విమర్శలు
వైసిపిని బంగాళాఖాతంలో కలపాలని పిలుపు


విశాఖ దక్షిణ నియోజకవర్గ నేతలతో కలిసి అభివాదం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్, గోపాలపట్నం విలేకరులు

'జగన్ నాడు విశాఖ పాదయాత్రలో జిల్లాకు 50 హామీలు ఇచ్చారు. విశాఖ రైల్వే జోన్ పూర్తిచేస్తామన్నారు. మెట్రోరైలు తెస్తామన్నారు. అవేవీ అమలుకాలేదు. ఉమ్మడి విశాఖలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అన్నారు. 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని చెప్పారు. ఆ హామీలేవీ నేటికీ నెరవేరలేదు' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని విశాఖ వాసులు బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన టిడిపి శంఖారావం సభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని తెలిపారు. అక్కడి భూములు కొట్టేయాలని చూస్తున్నారన్నారు. ఫలితంగా వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారన్నారు. టిడిపి - జనసేన ప్రభుత్వం వస్తే విశాఖ ఉక్కును కొనుగోలు చేసి ప్లాంట్‌ను కాపాడుతామని అన్నారు. జగన్ హయాంలో విశాఖపట్నం విషాదపట్నంగా మారిందన్నారు. గంజాయికి నగరం వేదికైందని తెలిపారు. నేరాలు పెరిగాయని అన్నారు. జగన్ జలగలాంటి వ్యక్తి అని విమర్శిస్తూ సైలెంట్‌గా గంగవరం పోర్ట్, కృష్ణపట్నం పోర్టులను కొట్టేశాడన్నారు. వాటిలో ఆయనకు వాటాలు పెట్టుకున్నాడని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా పోర్టులు మూసేస్తున్నాడని తెలిపారు. దీంతో కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న 10 వేల మంది కార్మికులు రోడ్డున పడనున్నారన్నారు. ఇదే పరిస్థితి గంగవరం పోర్టుకూ రాబోతోందన్నారు.

'వాసుపల్లికి టికెట్ ఇచ్చి తప్పు చేశాం.. క్షమించండి'

మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిన విశాఖ దక్షిణ నియోజకవర్గం విషయంలో వాసుపల్లి గణేష్ కుమార్‌కు రెండుసార్లు తెలుగుదేశం పార్టీ టికెట్ ఇచ్చిందని, ఆయన వ్యక్తిగత స్వార్థంతో వైసిపిలోకి వెళ్లారని, అలాంటి వ్యక్తులకు టిడిపిలో నో ఎంట్రీ అని లోకేష్ అన్నారు. వాసుపల్లికి టికెట్ ఇచ్చి పొరపాటు చేశామని, తమను పెద్ద మనసుతో నియోజవర్గ ప్రజలు క్షమించాలని అన్నారు. దక్షిణ నియోజవర్గంలోని పేదలు ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. వారికోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకరిస్తామని తెలిపారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో టిడిపి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు

వీడని గందరగోళం

కొన్ని సీట్లలో జనసేన, టిడిపి పట్టు
అభిప్రాయ సేకరణలో జనసేన
క్యాడర్‌ను కలిపే పనిలో లోకేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో తాము పోటీచేయబోయే సీట్లపై స్పష్టత కోసం పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకొనే పనిలో జనసేన నాయకులుండగా, యువగళం పాదయాత్రలో పెద్దగా కేంద్రీకరించని ప్రాంతాలపై శంఖారావం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఫోకస్ పెట్టారు. అనకాపల్లి జిల్లాలో కొద్ది రోజుల క్రితం పలువురి నాయకులు, క్యాడర్‌ను జనసేన నాయకులు నాగబాబు కలిశారు. తమకున్న రాజకీయ శక్తి, సామాజిక బలంపై వివరాలను ఆయన కేడర్‌ను అడిగితెలుసుకున్నట్లు తెలుస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం సాయంత్రం విశాఖ నగరానికి చేరుకున్నారు. నియోజకవర్గ నాయకులు, క్యాడర్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకోవడానికి సోమవారం ఓ సమావేశం ఏర్పాటుచేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని యలమంచిలి, పెందుర్తి నుంచి పోటీచేయాలని జనసేన నాయకులు సుందరపు విజయకమార్, పంచకర్ల రమేష్‌బాబు పట్టుబడుతున్నారు. నగర పరిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్, కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, శివశంకర్, పసుపులేటి ఉషాకిరణ్ పోటీచేసే ఆలోచనలో వున్నారు. జనసేన, టిడిపి మధ్య సీట్ల కేటాయింపు తేలకపోవడంతో కొన్ని నియోజకవర్గాల్లో తాను పోటీచేయనున్నానంటే, తాను పోటీచేయనున్నానంటూ టిడిపి, జనసేన నాయకులు ఎవరికి వారు ప్రచారం చేసుకోవడంతో కేడర్‌లో గందరగోళం ఏర్పడుతోంది.

ఎన్నికలు సమీపిస్తుండడంతో కేడర్‌కు ఓ స్పష్టత ఇవ్వడం కోసం పవన్ విశాఖ వచ్చినట్లు సమాచారం. పోటీచేయడానికి ఉన్న అవకాశాలు, అవరోధాలు కూడా కేడర్‌కు వివరించి, ఆశావహులకు సీట్లు రాకపోయినా అసంతృప్తి చెందకుండా ఎన్నికల్లో పనిచేసేలా సూచనలు చేయనున్నట్లు తెలిసింది. ఇటీవల జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లి ఎంపీగాగానీ, ఎమ్మెల్యేగాగానీ అవకాశమిస్తే పోటీచేయడానికి సానుకూలంగా వున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడ నుంచి ఎవరు పోటీచేస్తే మంచి ఫలితాలు సాధించగలమన్న అభిప్రాయాలను సేకరించి టిడిపితో సీట్ల కేటాయింపుపై చర్చించాలన్న యోచనలో పవన్ కల్యాణ్ వున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇదే సమయంలో టిడిపి శంఖారావం పేరుతో లోకేష్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. విశాఖ నగరంలో తన పర్యటన సోమవారం మధ్యాహ్నానికి పూర్తిచేసుకొని, సాయంత్రానికి అనకాపల్లి నియోజకవర్గానికి ఆయన చేరుకోనున్నారు. అనకాపల్లి తరువాత చోడవరం నియోజకవర్గం శంఖారావం పూర్తిచేసుకొని, మంగళవారం మాడుగుల నియోజకవర్గంలో సభ నిర్వహించనున్నారు. లోకేష్ తన శంఖారావంలో టిడిపి, జనసేన నాయకత్వం కలిసి పనిచేసేలా సభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు.


తీరంలో ఆకట్టుకున్న నేవీ హెలీకాప్టర్ల రిహార్సల్స్

నేటి నుంచి మిలాన్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిలాన్ - 2024 విన్యాసాలకు విశాఖ తీరం సిద్ధమైంది. ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగే ఈ 12వ ఎడిషన్ విన్యాసాలు సోమవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. 50 దేశాలకు చెందిన ప్రతినిధులు, నౌకలు పాల్గొనే అవకాశముంది. ఈ నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్‌కు సంబంధించి విశాఖ నగరంలోనూ, 24 నుంచి 27 వరకూ సీ ఫేజ్ బంగాళాఖాతంలోనూ ఈ విన్యాసాలు జరుగనున్నాయి. ఇప్పటికే వియత్నాం, యుఎస్ నావికా దళాలకు చెందినా నౌకలు, ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. సోమవారం మిగిలిన దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు మిత్ర దేశాలకు చెందిన 15 నౌకలు విశాఖ చేరుకోనున్నాయి. రెండో రోజు మంగళవారం బీచ్ రోడ్డులో నావికా దళ విన్యాసాలతో పాటు మిలాన్ ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్ జరుగనున్నాయి. మూడో రోజు ఉదయం తూర్పు నావికాదళంలో సముద్రిక నావల్ ఆడిటోరియంలో ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నారు. నాలుగో రోజున బీచ్ రోడ్డులోని వైఎంసిఎ నుంచి ఆర్‌కె బీచ్ వరకూ ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ జరుగనుంది. చివరి రోజున పలు దేశాల నావికా దళాల మధ్య సమావేశాలు, సెమినార్లు ఉంటాయి. అనంతరం 24 నుంచి 27 వరకూ సీ ఫేజ్ విన్యాసాలు జరగనున్నాయి.

రెండో రోజూ కొనసాగిన రిహార్సల్స్

నావికాదళ సన్నాహక విన్యాసాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ విన్యాసాలలో మిగ్ 29కె, పి8ఐ, ఎంహెచ్ 60 ఆర్‌సి హాక్ హెలీకాప్టర్లు, ప్యారాచూట్ విన్యాసాలు, మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేవీ బ్యాండ్ వినసొంపుగా సాగింది. నేవీ స్కూలు చిన్నారుల నృత్యాలు కనువిందు చేశాయి.

నగరమంతా భారీ భద్రతా ఏర్పాట్లు

మిలాన్ విన్యాసాల నేపథ్యంలో ఐదు వేల మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డితో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉందని నేవీ అధికారులు తెలిపారు. అతిథులు ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులపై ఇప్పటికే రూట్ మ్యాప్‌లు విడుదల చేసామని పోలీసు అధికారులు చెప్పారు. నగరమంతా ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

త్వరలో అనకాపల్లి పేరుతో సినిమా

ప్రజాశక్తి- అనకాపల్లి: తన సొంత నిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్స్ బ్యానర్‌పై 'అనకాపల్లి' పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు సినీ దర్శకులు నక్కిన త్రినాధరావు ప్రకటించారు. ఆదివారం గౌరీ గ్రంథాలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లిలోనే నటీనటుల ఎంపిక (అడిషన్స్), చిత్రీకరణ జరుగుతుందన్నారు .తన సినీ జీవిత ప్రస్థానానికి బీజం వేసింది శ్రీగౌరీ గ్రంథాలయంలోనేనని, సినిమాలకు సంబంధించిన పుస్తకాలను ఇదే గ్రంథాలయంలోనే చదువుకున్నా నన్నారు. సినీ పరిశ్రమలో ఎంతటివారికైనా గ్యారెంటీ సున్నాయేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, వృత్తినైపుణ్య శిక్షణ కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహించడం ద్వారా ఎందరికో ఉద్యోగ, ఉపాధికి దోహదపడడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఆలోచనలు, పాఠకులు మనోగతానికి అనుగుణంగా ఆధునాతన సాంతికేక పరిజ్ఞానంతో గౌరీ గ్రంథాలయాన్ని అప్‌టూ డేట్ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, జగన్నాథస్వామి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, సినీ నటుడు బాలాజీ బద్రీనాధ్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల సురేష్, శీలా జగన్నాధరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్కిన త్రినాధరావును గ్రంథాలయ కమిటీ ఘనంగా సత్కరించింది.